స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా శ్రీనివాస్‌రెడ్డి



కామారెడ్డి టౌన్, మార్చి 14: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా దవలాపూర్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కలిసి మొక్కను అందించారు. గత కొంతకాలంగా స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా వెయిటింగ్‌లో ఉన్న ఆయనను రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డికి కేటాయించింది. అదేవిధంగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిగా అంబాజీ గురువారం బాధ్యతలు స్వీకరించారు.

- జహీరాబాద్ లోక్‌సభ బరిలో పాత కాపులే
- ఈ ఎంపీ స్థానానికి ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు
- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్యనే ప్రధాన పోరు
- బీజేపీ తరపున సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్
- కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్
- బీఆర్ఎస్ నుంచి బరిలో గాలి అనిల్‌కుమార్
- ఎన్నికల ప్రచారంపై దృష్టి పెట్టనున్న అభ్యర్థులు



పోరు రసవత్తరం

కామారెడ్డి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇలా ఎవరనేది తేలింది. ఇక ఈ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల పోరు రసవత్తరంగా మారనుంది. అభ్యర్థులు పార్టీలు మారినప్పటికీ ఈ లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆయా ప్రధాన పార్టీలు పాత కాపులనే బరిలో దింపడం విశేషం. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులను ప్రకటించడంతో వారు ఇక ప్రచారంపై దృష్టి సారించనున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్ బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్, బీఆర్ఎస్ పార్టీ నుంచి గాలి అనిల్‌కుమార్ బరిలో ఉండనున్నారు. బీఆర్ఎస్ ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ ఇటీవల బీజేపీలో చేరి అదేస్థానం నుంచి టికెట్ తెచ్చుకున్నారు. ఇక బీఆర్ఎస్ నుంచి జహీరాబాద్ లోక్‌సభలో కొత్తగా గాలి అనిల్‌కుమార్ పోటీ చేయనున్నారు. జహీరాబాద్ ఎంపీ స్థానంలో త్రిముఖ పోటీ నెలకొననుంది. ఈ ముగ్గురు అభ్యర్థుల మధ్యనే పోటీ ఉండనుంది.

బరిలో పాత కాపులే..

ఈ లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులను పాత కాపులకే టికెట్లు ఖరారు చేసింది. అభ్యర్థులు పార్టీలు మారినప్పటికీ బరిలో మాత్రం వారే ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీ అభ్యర్థిగా ఉన్న సురేష్‌షెట్కార్ 2004, 2009లో కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేసి వరుసగా విజయం సాధించారు. 2014లో కాంగ్రెస్ పార్టీ నుంచే బరిలో దిగి ఓటమి పాలయ్యారు. 2019లో సురేష్‌షెట్కార్‌కు కాకుండా మదన్ మోహన్‌రావు కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అధిష్ఠానం సురేష్‌షెట్కార్‌కే టికెట్ ఖరారు చేసింది. అయితే జహీరాబాద్ ప్రస్తుత ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ పార్టీ మారారు. ఆయన బీజేపీలో చేరగానే మరుసటి రోజే ఆ పార్టీ అధిష్ఠానం జహీరాబాద్ నుంచే టికెట్ ఖరారు చేసింది. గత లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన బీబీ పాటిల్ ప్రత్యర్థి మదన్ మోహన్‌రావుపై స్వల్ప ఓట్లతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లోనూ బీజేపీ బీబీ పాటిల్‌పై మొగ్గు చూపి మరోసారి అవకాశం ఇచ్చారు. అయితే ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి కొత్త అభ్యర్థిని బరిలో దింపింది. బీబీ పాటిల్ బీజేపీలో చేరడంతో తెరపైకి గాలి అనిల్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని బీఆర్ఎస్ ఖరారు చేసింది. గాలి అనిల్‌కుమార్ గత పార్లమెంట్ ఎన్నికల్లోనూ మెదక్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈ సారి జహీరాబాద్ నుంచి బీఆర్ఎస్ తరపున బరిలో దిగనున్నారు. ఇలా లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీల తరపున బరిలో ఉన్న ముగ్గురు పాత కాపులే కావడం విశేషం. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఖరారు కావడంతో ఇక ప్రచారంపై దృష్టి సారించనున్నారు.



బీబీ పాటిల్

సురేష్ షట్కార్

గాలి అనిల్‌కుమార్

సురేష్ షెట్కార్‌ను అదృష్టం వరించేనా?

జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి రెండు సార్లు ఎంపీగా ఎన్నికైన కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు మరోసారి ఎంపీగా గెలిచే అదృష్టం వరిస్తుందో లేదో చూడాలి. ఈ లోక్‌సభ పరిధిలోంచి మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ నాలుగోసారి బరిలో దిగనున్నారు. గతంలో ఇదే స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున సురేష్ షెట్కార్ మూడు పర్యాయాలుగా పోటీ చేశారు. 2004లో జహీరాబాద్ ఎంపీగా పోటీ చేసిన షెట్కార్ ఎంపీగా గెలుపొందారు. అనంతరం 2009లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ పార్టీ అధిష్ఠానం షెట్కార్‌నే బరిలో దింపగా సమీప ప్రత్యర్థి అయిన టీఆర్ఎస్ అభ్యర్థి యాసుఫ్‌అలీపై విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ తరపున సురేష్ షెట్కార్ బరిలో దిగి టీఆర్ఎస్ అభ్యర్థి బీబీ పాటిల్ చేతిలో ఓటమి పాలయ్యారు. 2019లో షెట్కార్ ఎంపీగా పోటీ చేసేందుకు సుముఖత చూపలేదు. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ప్రభుత్వంను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లోంచి 4 సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. దీంతో జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ టికెట్‌కై పలువురు టికెట్ ఆశించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించే అవకాశాలు ఉండడంతో పార్టీ అధిష్ఠానం సైతం గెలిచే అభ్యర్థినే బరిలో దింపాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ సీనియర్ నాయకుడైన సురేష్‌షెట్కార్‌నే జహీరాబాద్ నుంచి ఎంపీగా బరిలో దింపింది. ఈ ఎన్నికల్లో సురేష్ షెట్కార్ విజయం సాధిస్తారా లేదా చూడాలి.

బీబీ పాటిల్ హ్యాట్రిక్ కొట్టేనా?

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తరపున సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ ఈ లోక్‌సభ ఎన్నికల్లోనూ మరోసారి బరిలో ఉన్నారు. ఈసారి బీజేపీ తరపున పోటీ చేస్తున్న బీబీ పాటిల్‌ను హ్యాట్రిక్ విజయం వరిస్తుందో లేదో చూడాలి. మద్నూర్ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన బీబీ పాటిల్ బడా వ్యాపారవేత్త. గత లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్ఎస్ బీబీ పాటిల్‌కు ఎంపీగా బరిలో దింపింది. ఎలాంటి రాజకీయ అనుభవం లేకున్నప్పటికీ తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర సాధనతో జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలు బీబీ పాటిల్‌కు పట్టం కట్టారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ తరపున బీబీ పాటిల్ పోటీ చేసి స్వల్ప ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్‌పై గెలుపొందారు. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోవడం జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో కేవలం బీఆర్ఎస్‌కు రెండు సీట్లే వచ్చాయి. అయితే బీబీ పాటిల్‌కు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు ప్రస్తుత ఎమ్మెల్యేలు సహకరించే అవకాశం లేకపోవడంతో ఆయన పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. మరుసటి రోజే అదే పార్టీ నుంచి జహీరాబాద్ అభ్యర్థిగా ప్రకటించుకున్నారు. అయితే రెండు సార్లు ఎంపీగా గెలిచిన తరువాత ప్రజలకు అందుబాటులో లేకపోవడం, పార్లమెంట్ సెగ్మెంట్‌లో అనుకున్న మేర అభివృద్ధి పనులు చేయకపోవడం ఆయనపై కొద్దిమేర వ్యతిరేకత ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బీబీ పాటిల్‌కు ప్రజలు ఏ మేరకు ఓట్లు వేస్తారో వేచి చూడాలి.

రెండో సారి ఎంపీగా పోటీ చేయనున్న గాలి అనిల్‌కుమార్

జిల్లాలో గత పదేళ్లలో బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉండేది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోనూ మెజార్టీ ఎమ్మెల్యే సీట్లు ఆ పార్టీకే ఉండేవి. అయితే ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ అధికారాన్ని కోల్పోయింది. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ తరపున పోటీ చేసేందుకు అభ్యర్థులే కరువయ్యారనే ప్రచారం సాగుతూ వచ్చింది. ఇదే క్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ నుంచి బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ బీజేపీలో చేరడంతో బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఇదే క్రమంలో ఎవరిని బరిలో దింపాలనేది బీఆర్ఎస్ అధిష్ఠానం సమాలోచనలో పడింది. ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, గాలి అనిల్‌కుమార్ పేర్లను తెరపైకి తీసుకువచ్చింది. వీరి ముగ్గురిలో గాలి అనిల్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని కేసీఆర్ ఖరారు చేశారు. గాలి అనిల్‌కుమార్ 2019లో మెదక్ ఎంపీగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నర్సాపూర్ టికెట్ ఆశించి రాకపోవడంతో మళ్లీ బీఆర్ఎస్‌లో చేరారు. తాజాగా జహీరాబాద్ నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేయనున్నారు. గాలి అనిల్‌కుమార్ రెండోసారి ఎంపీగా బరిలో దిగనున్నారు.

రేషన్‌కార్డులకు.. మోక్షం కలిగేనా?

- ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డులను తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి కుటుంబం నుంచి వేరుపడిన వారి పరిస్థితి అగమ్యగోచరం
- ఏ పథకానికి అర్హత సాధించలేక నానా తంటాలు
- ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేస్తేనే పథకాలకు అర్హులు

కామారెడ్డి టౌన్, మార్చి 14: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మంజూరు చేస్తున్న ప్రతీ పథకానికి రేషన్‌కార్డుతో లింక్ పెట్టడంతో పలువురు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దరఖాస్తులు చేసుకుని ఏళ్ల గడుస్తున్నా కొత్త రేషన్‌కార్డులు లేక పలువురు ప్రభుత్వ గ్యారెంటీ పథకాలకు దూరమవుతున్నారు. గత ఐదేళ్లుగా నూతనంగా రేషన్ కార్డులు మంజూరుకాక పోవడంతో ఉమ్మడి కుటుంబంలో ఉండి వేరు పడిన వారికి కార్డులు లేవు. దీంతో వారంతా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు అందుకోలేక పోతున్నారు. ఏ పథకానికి దరఖాస్తు పెట్టుకుందామనుకున్నా రేషన్‌కార్డు అడగడంతో వారు నానా తంటాలు పడుతున్నారు.

ఆరు గ్యారెంటీలకు దూరమైనా?

పేదలకు రేషన్ సరుకులు అందించాలన్న లక్ష్యంతో ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రభుత్వం తీసుకోచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టింది. ఆ పథకాలు పొందాలంటే రేషన్‌కార్డు ప్రామాణికమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రజా పంపిణీ బియ్యం అందాలన్నా, పింఛన్ పొందాలన్నా, రుణమాఫీ అమలు కావాలన్నా రేషన్‌కార్డు తప్పనిసరి. రాష్ట్ర వ్యాప్తంగా ఐదేళ్లుగా రేషన్ కార్డులు జారీ కాలేదు. ఈ కాలంలో పెళ్లయిన జంటలకు రేషన్‌కార్డులు లేవు. ప్రభుత్వ నిబంధనలతో వీరంతా గ్యారెంటీ పథకాలకు దూరవుతున్నారు.

ఖాతాలు మనుగడలో లేకపోతే!?

ప్రస్తుతం సిలిండర్ ధర రూ.955గా ఉంది. వినియోగదారులు ఈ మొత్తాన్ని చెల్లించి సిలిండర్ తీసుకుంటే తర్వాత వారి ఖాతాల్లో సబ్సిడీ డబ్బులు జమ చేస్తారు. గ్యాస్ వినియోగదారుల్లో రేషన్‌కార్డు దారులే అత్యధికులు ఉంటారు. బ్యాంక్ ఖాతాలు సక్రమంగా కొనసాగుతున్న వారికి రాయితీ సొమ్ము జమయ్యే అవకాశం ఉంటుంది. రేషన్‌కార్డుకు అనుసంధానమై ఉన్న ఖాతా వినియోగంలో లేకపోతే తిరిగి పునరుద్ధరణ, కొత్త ఖాతాలకు అనుమతిస్తారో లేదోనని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గృహజ్యోతి పథకం కింద రేషన్ కార్డుదారులకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత గృహ విద్యుత్ పథకాన్ని తాజాగా ప్రారంభించారు. జిల్లాలో 4 లక్షలకు పైగా విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. వీరిలో రేషన్ కార్డులు లేని వారు ఎక్కువ మందే ఉండడం గమనార్హం. వీరంతా ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని పొందలేకపోతున్నారు.

దరఖాస్తులకు మోక్షం కలిగేనా?

గతంలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించినా ఎప్పటికీ ఆ ప్రక్రియ ముందుకు సాగక కార్డులు మంజూరు కాలేదు. ప్రజాపాలనలో భాగంగా అధికారులు దరఖాస్తులు స్వీకరించగా ఇందులో రేషన్‌కార్డులకు లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఐదేళ్లుగా కొత్త రేషన్‌కార్డులు జారీ కాకపోవడంతో ప్రతీనెల వచ్చే బియ్యంతో పాటు ప్రభుత్వ పథకాలకు దూరవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్‌కార్డు ప్రామాణికమని నిబంధనలు పెట్టినప్పుడు ముందుగా రేషన్‌కార్డులు జారీ చేయాలని పలువురు కోరుతున్నారు. రేషన్‌కార్డుల దరఖాస్తులకు మోక్షం లభిస్తేనే అర్హులకు పథకాలు వర్తించనున్నాయి.



డీలర్లు వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కామారెడ్డి టౌన్, మార్చి 14: ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు విక్రయించే డీలర్లకు వ్యవసాయ రంగంపై అవగాహన కలిగి ఉండాలని అప్పుడే రైతులకు నాణ్యమైన మేలు రకం వాటిని అందించవచ్చని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని నిర్వహించిన వ్యవసాయ విస్తరణ సేవ డిప్లోమా కోర్సు శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఒక్కో బ్యాచ్‌లో 40 మంది డీలర్ల చొప్పున ఉంటారని వారికి 48 వారాల పాటు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయించటంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుల పంట పొలాలకనుగుణంగా ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు అందించాలని, లాభాపేక్షతో అనవసరంగా సారవంతమైన భూములకు వాటిని అందించి పాడు చేయవద్దని తెలిపారు. ఆధారిత ప్రాంతమైన మన జిల్లాలో రైతులకు వ్యవసాయం లాభసాటి కల్పించుటకు గాను శాస్త్ర, సాంకేతిక పద్ధతులు అవలంబించుటకు అవగాహన కలిగించాలని డీలర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మేనేజ్ సంస్థ ప్రతినిధి సుధారాణి, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ, తరగతులు పెసిలిటేటర్లు నరసింహాచారి, రామచంద్రరెడ్డి, వ్యవసాయాధికారులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ఉపాధి హామీ పథకంలో నీటి సంరక్షణ పనులు చేపట్టాలి

ఉపాధి హామీ పథకంలో నీటి సంరక్షణ పనులు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. గురువారం ఉపాధి హామీ పథకంపై మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీలో భాగంగా నీటి నిల్వ కుంటలు, పర్కులేషన్ ట్యాంకులు, కంటూర్ కందకాలు కూలీలతో తవ్వించి భూగర్భ జలాల పెంపునకు దోహదపడాలని తెలిపారు. ఉపాధి హామీ పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరయ్యే విధంగా మండల స్థాయి అధికారులు చూడాలని తెలిపారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించి, జాబ్‌కార్డు ఉన్న కూలీలకు పనులు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ చందర్‌నాయక్, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ కమిటీలచే పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన

అమ్మ ఆదర్శ కమిటీలచే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులతో మాట్లాడారు. మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి మహిళ సంఘాలకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతీ ప్రభుత్వ పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను సత్వరమే ఏర్పాటు చేయాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో మహిళా సంఘం నాయకురాలు అధ్యక్షురాలిగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెంబర్ కన్వీనర్‌గా ఉంటారని తెలిపారు. గ్రామంలో 2, 3 మహిళా సంఘాలు ఉంటే పాఠశాలకు దగ్గరగా ఉన్న మహిళా సంఘానికి మొదటి సంవత్సరం అవకాశం కల్పించాలని, కమిటీ అధ్యక్షుడు మెంబర్ కన్వీనర్ కలిసి పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లుల కమిటీ సభ్యులుగా ఎంపిక చేస్తారని, రెండు సంవత్సరాల పాటు పాఠశాల నిర్వహణ కమిటీ ఉంటుందని, అమ్మ పాఠశాల నిర్వహణ కమిటీకి ప్రత్యేక బ్యాంక్ ఖాతా ప్రారంభించాలని సీఎస్ సూచించారు. అమ్మ ఆదర్శ కమిటీల వద్ద రూ.25 వేల వరకు ఎమర్జెన్సీ నిధులు వినియోగించవచ్చని, మిగిలిన పనులు జిల్లా సమాఖ్యకు కేటాయించాల్సి ఉంటుందని, డీఎంఎఫ్‌టీ, ప్రత్యేక అభివృద్ధి నిధులు వినియోగించుకుని పాఠశాలల్లో వసతులు చేపట్టాలని తెలిపారు. పాఠశాలల్లో చేపట్టిన పనులకు లక్షల రూపాయల వరకు ఎంపీడీవో పరిశీలించి బిల్లులు చెల్లిస్తారని, లక్షకు పైగా పనులకు ఎం బుక్‌లను పరిశీలించి కలెక్టర్ చెల్లింపులు చేస్తారని తెలిపారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

బాన్సువాడ టౌన్, మార్చి 14: వేసవి దృష్ట్యా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు శుక్రవారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభమవుతున్నట్లు మండల విద్యాధికారి నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పాఠశాలలు కొనసాగుతాయన్నారు.

అన్ని విభాగాల్లో విజేతలుగా ఏఆర్ టీం

కామారెడ్డి టౌన్, మార్చి 14: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా పోలీసు స్పోర్ట్స్ మీట్ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎస్పీ సింధూశర్మ క్రీడా పోటీల్లో చాంపియన్‌గా నిలిచిన ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు కప్‌ను అందించారు. క్రికెట్‌లో మొదటి స్థానంలో నిలిచిన ఆర్మ్‌డ్ రిజర్వుడ్ పోలీసులు, రెండో స్థానంలో కామారెడ్డి సబ్ డివిజన్, వాలీబాల్‌లో మొదటి స్థానంలో ఏఆర్ పోలీసులు, రెండో స్థానంలో డీపీవో టీం, కబడ్డీలో ఏఆర్ పోలీసులు మొదటి స్థానంలో, రెండో స్థానంలో డీపీవో టీం, టగ్‌ఆఫ్ వార్‌లో ఏఆర్ పోలీసులు మొదటి స్థానంలో, రెండో స్థానంలో కామారెడ్డి సబ్ డివిజన్ నిలిచారు. వారికి ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు నాగేశ్వరరావు, శ్రీనివాసులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కప్‌ను అందిస్తున్న ఎస్పీ సింధూశర్మ



చికిత్స పొందుతూ ఏఆర్ కానిస్టేబుల్ మృతి

ఖిల్లా, మార్చి 14: ఈనెల 12న రోడ్డు ప్రమాదానికి గురైన ఏఆర్ కానిస్టేబుల్ శంకర్ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వల్లె శంకర్ ఈనెల 12న 6వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు బల మైన గాయాలు కావడంతో ఆయన్ను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతదేహాన్ని జిల్లాకేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహం వద్ద పూలమాలలు పెట్టి అదనపు డీసీపీ నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పల్లె శంకర్ 1990లో కానిస్టేబుల్‌గా విధుల్లోకి చేరాడని, మృతుడికి కుమారుడు, కూతురు తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో ఏఆర్ ఏసీపీ కె.నాగయ్య, రిజర్వు ఇన్‌స్పెక్టర్ వెంకటి, ఆర్ఎస్సై దత్తు, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్‌పాషా, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మృతుడి కుటుంబానికి పోలీస్‌శాఖ ద్వారా అన్నిరకాల సహాయ సహకారాలు అందించనున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ తెలిపారు.

నగరంలో చిరుత కలకలం

సుభాష్‌నగర్, మార్చి 14: నగరంలో చిరుత పులి సంచారం కలకలం రేపింది. గురువారం ఉదయం కంఠేశ్వర్‌లోని రైల్వే బ్రిడ్జి ప్రాంతంలో చిరుత సంచరిస్తుందంటూ ఫారెస్టు అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. స్పందించిన ఫారెస్టు అధికారులు రైల్వే బ్రిడ్జి ప్రాంతానికి చేరుకొని అక్కడ చిరుత సంచరించిన ఆనవాళ్లను తెలుసుకునేందుకు చర్యలు చేపట్టారు. స్థానిక 3వ టౌన్ పోలీసులతోపాటు చిరుత సంచరిస్తుందన్న ప్రాంతాలను పోలీసులు పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న పాదముద్రలను పరిశీలించారు. చివరకు చిరుత పాదం ముద్ర గుర్తులు కావని, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పద్మారావు వివరించారు. స్థానికులు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. పరిసర ప్రాంతాల్లో చిరుత సంచరించినట్లు ఎలాంటి ఆనవాళ్లు వెల్లడించారు.



చిరుత ఆనవాళ్లను పరిశీలిస్తున్న పోలీసులు

సమాజానికి సేవ చేయాలనే లక్ష్యం ప్రతీ ఒక్కరికి ఉండాలి

● ప్రముఖ శాస్త్రవేత్త, బీజేపీ నాయకుడు పైడి ఎల్లారెడ్డి

నాగిరెడ్డిపేట, మార్చి 14: సమాజానికి సేవ చేయాలనే లక్ష్యం ప్రతీ ఒక్కరికి ఉంటే సమాజం ఎంతో బాగుంటుందని ప్రముఖ శాస్త్రవేత్త, బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నాయకుడు పైడి ఎల్లారెడ్డి అన్నారు. ఆయన గురువారం మండలంలోని తాటిచెట్టు గడ్డతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం బెంచీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో స్వచ్ఛందంగా ప్రజల కోసం వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు కామారెడ్డి జిల్లాలో వివిధ మండలాల్లోని చాలా గ్రామాల్లో తాగునీటి శుద్ధీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ రాజ్‌దాస్, ఎంపీటీసీ సుజాత, మాజీ సర్పంచ్ కేస్లీ వస్రం నాయక్, ఆత్మకూరు మాజీ సర్పంచ్ గడ్డం బాల్‌రెడ్డి, నాయకులు ధనుంజయ్, దేవీసింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజస్విని, ఉపాధ్యాయురాలు సుమలత, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వయంపాలన దినోత్సవం

నాగిరెడ్డిపేట మండలంలోని వదల్‌పర్తి ప్రభుత్వ యూపీఎస్, తాటిచెట్టు గడ్డతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో గురువారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. స్వయంపాలన దినం సందర్భంగా విద్యార్థులు ఒక రోజు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో యూపీఎస్ ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజస్విని, ఉపాధ్యాయులు శార్వాణి, భాగ్యలక్ష్మీ, గోపాల్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

బీబీ పాటిల్ గెలుపు కోసం కృషి చేస్తా..

పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ స్థానంలో బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ గెలుపు కోసం కృషి చేస్తానని ప్రముఖ శాస్త్రవేత్త, బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నాయకుడు పైడి ఎల్లారెడ్డి తెలిపారు. ఆయన గురువారం మండలంలోని తాటి చెట్టు గడ్డ తండాకు



సమావేశంలో మాట్లాడుతున్న పైడి ఎల్లారెడ్డి

విచ్చేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం బీజేపీ టికెట్ కోసం పైడి ఎల్లారెడ్డి విశ్వ ప్రయత్నం చేసి విఫలమయ్యారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరడంతోనే ఒక్క రోజులోనే పార్టీ అధిష్ఠానం బీబీ పాటిల్‌కు జహీరాబాద్ టికెట్ ఇచ్చింది. దీంతో పార్టీ ఆదేశాల మేరకు బీబీ పాటిల్‌తో కలిసి ఎన్నికల్లో పని చేస్తానని, బీబీ పాటిల్ గెలుపు కోసం కృషి చేస్తానని పైడి ఎల్లారెడ్డి తెలిపారు.



మొబైల్ లోక్‌అదాలత్ బస్సును ప్రారంభిస్తున్న న్యాయాధికారి శ్రీదేవి

మొబైల్ లోక్ అదాలత్ బస్సు ప్రారంభం

కామారెడ్డి టౌన్, మార్చి 14: జిల్లాలోని ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించే మొబైల్ లోక్ అదాలత్ బస్సును గురువారం జిల్లా న్యాయాధికారి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శివరాత్రి ప్రతాప్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించనున్నారని తెలిపారు. ఈ బస్సు కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి బయలుదేరుతుందని ఎల్లారెడ్డి వాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆ తర్వాత బాన్సువాడలో మొబైల్ లోక్ అదాలత్ బస్సు తిరుగుతుందని తెలిపారు. అలాగే 16న జాతీయ లోక్ అదాలత్ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిస్ట్రిక్ట్ న్యాయాధికారి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్, సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగరాణి, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సుధాకర్, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దీక్ష, పీపీ రాజగోపాల్‌గౌడ్, రమేష్ చందర్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన

హాస్టల్ వార్డెన్ భర్తపై చర్యలు తీసుకోవాలి : ఏబీవీపీ

కామారెడ్డి టౌన్, మార్చి 14: భిక్కనూర్ బాలల హాస్టల్‌లో విద్యార్థిని చితకబాదిన హాస్టల్ వార్డెన్ భర్తపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ హాస్టల్ కన్వీనర్ ఖలీల్ అన్నారు. గత రెండు రోజుల కిందట హాస్టల్ వార్డెన్ భర్త విద్యార్థినికి వాతలు తేలే వరకు కొట్టాడని తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఇకనైన అధికారులు తగిన చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంధం సంజయ్, వినయ్, అల్తాఫ్, వెంకి తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పోచారం, గాలి అనిల్‌కుమార్

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పోచారం, ఎంపీ అభ్యర్థి

బీర్కూర్, మార్చి 14: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువు దీరిన కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి వారిని, అమ్మవార్లను గురువారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌లు దర్శించుకున్నారు. స్వామి వారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఎంపీగా పోటీ చేస్తున్న అనిల్‌కుమార్‌కు శాలువాలతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు ఇసుక వేలం పాట

బిచ్కుంద, మార్చి 14: నాలుగు రోజుల కిందట మంజీరా పరివాహక ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తు పట్టుబడిన పది ట్రాక్టర్ల ఇసుకకు వేలం పాట నిర్వహిస్తామని తహసీల్దార్ తెలిపారు. శుక్రవారం పోలీసుస్టేషన్‌లో ఉదయం 11.30 గంటలకు ఇసుక వేలం నిర్వహి ంచనున్నామన్నారు. ఆసక్తిగలవారు వేలం పాటలో పాల్గొని ఇసుక దక్కించుకోవాలని తెలిపారు.

రేపు నరేంద్రనాథ్ మహరాజ్ రాక

మద్నూర్, మార్చి 14: జగద్గురు రామానందచార్య నరేంద్ర చార్య మహరాజ్ శనివారం తెలంగాణ ఉప పీఠం జుక్కల్‌కు రానున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. జుక్కల్ మండలం బంగారుపల్లి ఉప పీఠం లో రెండు రోజుల పాటు జగద్గురు నరేంద్రనాథ్ మహరాజ్ సమస్యలు, మార్గదర్శనం చేస్తారని నిర్వాహకులు వెల్లడించారు. అయా గ్రామాల్లో మహిళలు, భక్తులు నరేంద్రనాథ్ మహరాజ్ రాకను పురస్కరించుకుని పోస్టర్లను ఆవిష్కరిస్తున్నారు. భక్తులు ఉప పీఠానికి వచ్చి జగద్గురు దర్శనం తీసుకోవాలని నిర్వాహకులు కోరారు.

క్రేన్ కింద పడి ఒకరి మృతి

మాచారెడ్డి, మార్చి 14: క్రేన్ కిందపడి పాల్వంచ మండలం వెల్పుగొండ గ్రామానికి చెందిన సగిడి చిన్నరాజయ్య(71) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చిన్నరాజయ్య గురువారం ఉదయం వెల్పుగొండ చెరువులో చేపలు పట్టుకుని పాల్వంచమర్రి వద్ద వాటిని విక్రయించి తిరిగి వెల్పుగొండకు వెళ్తుండగా క్రేన్ వాహనం వెనుక నుంచి ఢీ కొట్టడంతో అక్కడికక్కడే రాజయ్య మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమార్తె లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ముగిసిన ఇంటర్మీడియట్ పరీక్షలు

బాన్సువాడ టౌన్, మార్చి 14: గత నెల 28న ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల శుక్రవారంతో ముగిశాయి. ఈ పరీక్షలకు గాను బాన్సువాడలో విద్యాశాఖాధికారులు మొత్తం 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించొద్దు

కామారెడ్డి టౌన్, మార్చి 14: కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలని అన్నారు. మోదీ ప్రభుత్వం మొదటిసారిగా అధికారంలోకి వచ్చే ముందు విదేశాల్లో ఉన్నటువంటి నల్లధనాన్ని వెనక్కి తీసుకువస్తామని చెప్పి దేశప్రజలందరూ జన్‌ధన్ ఖాతాలు తీయమని చెప్పి వారి ఖాతాల్లో డబ్బులు వేయలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన చేస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చాడని తెలిపారు. మరోమారు అధికారంలోకి రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు మిగిలింది వ్యవసాయరంగం ఒకటే వ్యవసాయరంగాన్ని మనం కాపాడుకోకపోతే వ్యవసాయరంగం ఈ దేశంలో తీవ్ర సంక్షోభంలో పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు



కామారెడ్డిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

బాలరాజు, కార్యదర్శి ప్రకాష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంబన్న, జిల్లా నాయకులు కిషోర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో అవగాహన సదస్సు

భిక్కనూరు, మార్చి 14: మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో గురువారం క్యాన్సర్ చికిత్సపై ఫ్లేవనోయిడ్స్ పాత్రపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పూర్ణచందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫ్లేవనోయిడ్‌లు ఆర్‌వోఎస్ హోమియోస్టాసిస్‌కు సంబంధించి ద్వంద్వ చర్యను కలిగి ఉంటాయని, అవి సాధారణ పరిస్థితుల్లో యాంటీ ఆక్సిడెంట్‌లుగా పని చేస్తాయన్నారు.క్యాన్సర్ కణాలలో శక్తివంతమైన ప్రో-ఆక్సిడెంట్‌లు అపోప్టోటిక్ మార్గాలను ప్రేరేపించడం, ప్రో-ఇన్‌ఫ్లమేటరీ సిగ్నలింగ్ మార్గాలను తగ్గించడం చేస్తాయన్నారు. అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్ పూర్ణచందర్ సౌత్ క్యాంపస్ రసాయనశాస్త్రం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, రసాయనశాస్త్రం విభాగం హెడ్ నాగరాజు,



భిక్కనూరులో మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పూర్ణచందర్

భౌతికశాస్త్రం హెడ్ సరిత, సిబ్బంది మోహన్‌బాబు, లలిత, నిరంజన్ శర్మ, సునీత, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అక్రమ లేఅవుట్‌లు లేకుండా చూడాలి

కామారెడ్డిటౌన్,మార్చి 14:నియోజకవర్గంలో అక్రమ లేఅవుట్‌లు లేకుండాచూడాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అధికారులకు సూచించారు. గురువారం నియోజకవర్గంలోని మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్,మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు అనుమతులు ఇచ్చిన వాటిలో ఏమైన లోపాలు ఉంటే వెంటనే సవరించాలని తెలిపారు. మిషన్‌భగీరథ నీళ్లు నియోజకవర్గంతో ప్రతీ ఇంటికి తప్పకుండా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.వేసవికాలంలో నీటి ఇబ్బందులు రాకుండా చూడాలని, విద్యుత్ అధికారులతో యాసంగి పంటకు కరెంటు ఇబ్బందులు ఉండోదని తెలిపారు. మున్సిపల్ అధికారులు నూతనంగా నిర్మించే భవనాలకు నిబంధనలకు లోబడి ఉంటేనే నూతన అనుమతులు ఇవ్వాలని ఎలాంటి తప్పిదాలు జరిగిన అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

సమాజంలో ఉపాధ్యాయవృత్తి చాలా ముఖ్యమైనది

● జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావ్

పిట్లం, మార్చి 14: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా ముఖ్యమైనదని విద్యార్థులకు తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అని ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావ్ అన్నారు.గురువారం పిట్లం రాజరాజేశ్వర ఫంక్షన్ హల్‌లో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కులకర్ణి గణేష్ పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తోటలక్ష్మికాంతారావ్ విచ్చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారికి బంగారు భవిషత్తును ఇవ్వడమే కాక భావి భారతపౌరులుగా తీర్చిదిద్ది, వివిధ రంగాలలో ఎంతో మంది మేధావులను తయారు చేసి దేశానికి అందించేది కూడా ఉపాధ్యాయులే అన్నారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రగోత్త మంరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కమలాకర్‌రావ్, జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కుశాల్, ఎంఈవో దేవిసింగ్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి, పీఆర్టీయూ నాయకులు సంతోష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి,కాంతరావు, లక్ష్మన్ సంతోష్, నార్యా, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అసమర్థుడు అవినీతిపరుడు

బిచ్కుంద:జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అభివృద్ధి పనులు చేయని అసమర్థుడని అన్ని పనులలో కమీషన్ తీసుకున్న అవినీతిపరుడని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు విమర్శించారు. గురువారం మండలంలోని బండారెంజల్ గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజచేసి ఖత్‌గావ్ గ్రామంలో పార్టీ కార్య కర్తలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు విశ్వాసం కోల్పోవడంతో ఎమ్మెల్యే,మాజీఎమ్మెల్యేలు,ఎంపీలు పార్టీలు మారుతున్నారని అన్నారు. నియోజకవర్గంలో ప్రతిగ్రామంలో కాంగ్రెస్ పార్టీలోకి భారీసంఖ్యలో బీఆర్ఎస్‌నాయకులు, కార్య కర్తలు చేరుతున్నట్లు తెలిపారు. 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గంలో పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టని ఏకైక ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరికి శ్రీకారం చుట్టినట్లు పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరుచేస్తామన్నారు. వెనుకబడిన జుక్కల్ నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లు పెంచి ఇవ్వాలని సీఎంను కోరగా సానుకులంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వివరించారు. పార్టీ గెలుపుకోసం కృషిచేసిన ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని అదేవిధంగా జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. ఈకార్య క్రమంలో టీపీసీసీ డెలిగేట్ సభ్యుడు విఠల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగాధర్,మాజీమార్కెట్‌చైర్మన్‌నాగ్‌నాథ్‌పటేల్,నౌషానాయక్, భీమ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం దంపతులు

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

● కుటుంబ సమేతంగా పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం

బీర్కూర్, మార్చి 14: బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గురువారం సాయంత్రం ఆలయ ధర్మకర్త ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని అంకురార్పణ చేశారు. టీటీడీలో ఈనెల 14 నుంచి 19వ తదేశ వరకు జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆలయ ధర్మకర్తలు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆయన సోదరుడు శంభురెడ్డిలు శాస్త్రోక్తంగా అంకుర్పాణ చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీవరి తరఫున సేనాధిపతి అయిన శ్రీ విశ్వక్సేనులు స్వామి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న, వరి పంటల పరిశీలన

గాంధారి, మార్చి 14: మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్ ఆధ్వర్యంలో మేడిపల్లి గ్రామంలో మొక్కజొన్న, వరి పంటలపై ఎగ్జామ్ లైఫ్ సైన్సెస్ వారి మనసాయిల్ మందును వాడడంతో ఆ పొలాలను చూడడానికి గురువారం జాంబియా దేశస్తులు వచ్చారు. రైతులు వాడిన మన సాయిల్ అనే మందుని వాడడం వల్ల భూమిని శుద్ధిచేసి నేల ఆరోగ్యాన్ని పెంచి మంచి దిగుబడి వస్తుందని ఎగ్జామ్ లైఫ్ సైన్సెస్ కంపెనీ ఎండీ సురేష్ తెలిపారు. ఈ మందులతో ఎక్కువగా దిగుబడులు వస్తున్నాయని రైతులతో అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు సుమేధ ప్రొడక్షన్ హెడ్ జాంబియా కంట్రికిపాబగారన్ జాంబియా రైతులు అయినటువంటి స్టీవార్డ్, మలయా, డీరియాస్, కంపెనీ రీజినల్ మేనేజర్ జాని భాష్, సేల్స్ ఎగ్జిక్యుటివ్ అభిలాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్: మండలంలోని ఆయా గ్రామాల శివారుల్లో పంటలను గురువారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. బంజాపల్లి గ్రామ శివారులో ఏఈవో స్వర్ణలత, వడ్డేపల్లి శివారులో ఏఈవో రేణుకలు పంటలను పరిశీలించారు. ప్రస్తుతం వరి పంటలకు తెల్ల కంకి ఉత్పత్తి ఉన్నం దున నివారణ కోసం కార్టప్ హైడ్రోక్లోరైడ్ మందును ఎకరాకు 400 గ్రాముల చొప్పున పిచికారి చేయాలని సూచించారు. రైతులు పంటలకు సంబంధించి ఏవైనా సందేహాలుంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ కృష్ణమూర్తి, లింగాగౌడ్, రాజు, దశరథ్, అంజయ్య తదితరులున్నారు.

బోరుబావి తవ్వకం

పెద్ద కొడప్‌గల్, మార్చి 14: మండలంలోని అంజనీ గ్రామంలో తాగునీటి ఎద్దడి తీర్చేందుకు గాను గ్రామంలో నూతన బోరుబావి తవ్వకం పనులు చేపట్టినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో నీటి ఎద్దడి ఉందని గ్రామస్థులు ఈ విషయాన్ని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావ్ దృష్టికి తీసుకరావడంతో స్పందించిన ఎమ్మెల్యే ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి లక్షా 50 వేలు నిధులు ఇచ్చారని, దీంతో గ్రామంలో బోరుబావి తవ్వకం పనులు ప్రారంభం చేసినట్లు మహేందర్ రెడ్డి తెలిపారు. గ్రామంలో తాగునీరు కొరత తీర్చేందుకు గాను నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు నాందేవ్ పటేల్, సాయాగౌడ్. అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు సన్మానం

దోమకొండ, మార్చి 14: ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా తాహెర్ బిన్ ఇటీవల నియమితులైన సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో మండల కాంగ్రెస్ నాయకులు కలసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ పార్టీ నుంచి అంచెలంచెలుగా ఎదిగి ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నియమితులవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ యూత్ అధ్యక్షుడు ఇలీయాస్, దోమకొండ పట్టణాధ్యక్షుడు సీతారాం మధు, నాయకులు పందిరి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.13 లక్షల 11 వేలకు తై బజార్ వేలం

మద్నూర్, మార్చి 14: మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీలో గురువారం తై బజార్ వేలం పాటను నిర్వహించారు. ఆయా గ్రామాలకు సంబంధించిన కాంట్రాక్టర్లు పాల్గొని, మద్నూర్ గ్రామ పంచాయతీ తై బజార్‌ను రూ. 13 లక్షల 11 వేలకు హన్మాండ్లు ఆవార్‌వార్ దక్కించుకున్నట్లు మద్నూర్ గ్రామ పంచాయతీ అధికారి బండి విజయ్ తెలిపారు. గ్రామ పంచాయతీ పరిసరాల్లో తై బజార్‌కు సంబంధించి వసూలు చేస్తున్న డబ్బులు గ్రామ పంచాయతీలో చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సందీప్, తదితరులున్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నాగిరెడ్డిపేట, మార్చి 14 : మండలంలోని మాల్‌తుమ్మెద గ్రామ శివారులోని మంజీరా నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మాల్ తుమ్మెద గ్రామానికి చెందిన నాయికోటి శ్రీకాంత్, గుడాల గణేష్, దండు నరేష్, కర్రె సంతోష్ అతని డ్రైవర్ తలారి రాజశేఖర్ అనే వ్యక్తులు బుధవారం రాత్రి మాల్‌తుమ్మెద గ్రామ శివారులోని మంజీరా నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసు పెట్రోలింగ్ నిర్వహించి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని నలుగురిపై వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. మంజీరా నది పరివాహక ప్రాంత గ్రామాల్లో అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.



ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న దృశ్యం

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- హనుమాన్
శాంతి	- గామి
ప్రియా 70	- భీమా
ప్రియా 35	- ఆపరేషన్ వాలెంటైన్

బాన్సువాడ

మహేశ్వరి	- భీమా
వెంకటేశ్వర	- రజాకార్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

